# మార్పు

- డి. శ్రీనివాసరావు



ఆరోజు ఉగాది కావడంతో ఆఫీస్‌కెళ్ళలేదు. చైత్ర మాసారంభం కావడంతో మనసంతా ఆనందంగా ఉంది. తీరిగ్గా పేపర్ చదువుతున్నాను. ఈలోగా ఉగాది పచ్చడితోబాటు మరో చేతిలో కాఫీ కప్పులో ప్రత్యక్షమైంది నా శ్రీమతి. ''ఏంటోయ్... ఈరోజు కొత్తచీరలో అదిరిపోతున్నావ్.'' అనడంతో, ''ఎందుకు అదరనూ... చేతిలో కాఫీ కప్పుంది కదా!'' అంది, నాలోని బలహీనత కాఫీ అని తెలియజేస్తూ. కాఫీ అందుకోబోయాను.

''ముందు ప్రసాదం... తర్వాత కాఫీ'' అంది. తప్పదా అని ప్రశ్నించిన నాకు తప్పదు అని సమాధానం ఇచ్చింది. షడ్రచుల సమ్మిళితమైన పచ్చడినారగించి కాఫీ త్రాగడం ముగిస్తుండగా ఎదురుగా ఇద్దరబ్బాయిలు వరండాలో ప్రత్యక్షమయ్యారు. అందులో ఒకడు మా బాబిగారి క్లాస్‌మేట్ అని అర్థం అయింది. ఆ ప్రక్కనున్న పద్దెనిమిదేళ్ల కుర్రాడి భుజంపై చేయివేసి మాట్లాడుతున్నాడు.

మా శ్రీమతిని కేకవేసి, ఆ ఇద్దరిని లోపలికి రమ్మని సైగ చేసాను. ముగ్గురూ ఒకేసారి రావడం జరిగింది. ''ఏం బాబు, ఏం కావాలి'' అని అడిగాను. శ్రీమతి కలుగజేసుకుని ''బాబిగాడు లేడు, ఆడుకోడానికెళ్ళాడు.'' అనడంతో- అది కాదండి... అని మాట్లాడడానికి సందేహించాడు ఆ యువకుడు.

''భయంలేదు... చెప్పుబాబు'' అన్నాను.

''వీడు మా మేనల్లుడు రవి, మీ అబ్బాయితోబాటు మన వీధిలోనున్న కాన్వెంట్‌లో చదువుతున్నాడు. మొన్న మీ బాబీకి వాడు లెక్కల నోట్సు ఇచ్చాడండి. నిన్న అడిగితే నాకు నోట్సు ఇవ్వలేదని మా రవితో అన్నాడంట. వీడేమో ఏడ్చుకుంటూ ఇంటికి రావడంతో అక్క నన్ను తోడిచ్చి పంపిందండి. దయచేసి ఆ పుస్తకం ఇప్పించండి'' అంటూ రిక్వెస్ట్ చేశాడా కుర్రాడు.

సరే.. బాబిగాడికి పిలూ అని శ్రీమతికి చెప్పబోయాను. ఈలోగా ఆవిడ మొహం కందినట్లనిపించింది.

''ఎపుడిచ్చావోయ్ పుస్తకం, రవీ...'' అంటూ ఉరిమిన శ్రీమతిని చూసి, ''మరేమో నిన్న... కాదు, మొన్న'' అంటూ తడబాటుపడ్డాడు.

''నిజం చెప్పు, మా బాబిగాడికి అలాంటి చెడ్డగుణాల్లేవ్. మా పిల్లాడు మంచివాడు. అలాంటి పనులు మీరే చేస్తారు'' అని గట్టిగా అనడంలో దర్పం స్పష్టంగా కనపడింది ఆవిడ మొహంలో.

''అది కాదండీ...'' అంటూ మాట్లాడబోయిన ఆకుర్రాడినుద్దేశించి, ''ఏది కాదు, నీకేంటి తెలుసు... పిల్లలూ, పిల్లలూ స్కూల్లో తేల్చుకోవాలి. అంతేగాని పండుగపూట ఇలా తగవుకి దిగడం బాగుందా'' అంటూ చెడమడా వాయించింది.

పాపం కుర్రాడు చిన్నబుచ్చుకున్నాడనిపించి, ''పోన్లేవోయ్.. ఏదో అడిగాడుగాని తగవుకి దిగలేదు కదా'' అనడంతో వాళ్ళకి వత్తాసు పలికానని నాతోబాటు ముగ్గురిపై ధ్వజమెత్తింది.

అంతవరకూ నిశ్శబ్దంగా ఉన్న ఆ కుర్రాడు కలుగజేసుకొని, ''ఏంటండీ పిల్లలు తప్పుచేయడంలో అసహజం ఏముందీ... పెద్దలే తప్పు చేస్తున్నపుడు... అయినా పెద్దవాళ్ళకి తమ పిల్లలెపుడూ మంచివారుగానే కన్పిస్తారు. ఎందుకంటే వాళ్ళ ముందు తప్పు చేయరుగాబట్టి'' అన్నాడా కుర్రాడు. అతను చెప్పిందాంట్లో తప్పులేదన్నట్లుగా శ్రీమతివైపు చూచాను. ఆవిడకి దెబ్బ ఎక్కడ తగలాలో అక్కడ తగిలిందేమో ఉగ్రనరసింహావతారం ఎత్తి బిగ్గరగా 'గెటవుట్' అనడంతో, ఆ ఇద్దరూ వెనుదిరిగారు. వారెళ్ళిన అరగంటకి బాబిగాడొచ్చాడు. వాడినేమీ ఈరోజు డిస్టర్బ్ చేయొద్దని చెప్పాను.

ఆరోజు రాత్రి పదిగంటలు కావొస్తుండటంతో బాబిగాడు గాఢ నిద్రలో ఉన్నాడు. బాబిగాడు పుస్తకాల షెల్ఫ్ దగ్గరకెళ్ళి వెతకనారంభించాను. దాంట్లో నోట్సులన్నీ వెతకగా ఒక నోట్సుపై 'కె. రవికుమార్' అని రాసుంది. ఈ నోట్సు ఉదయం వచ్చిన రవిదే అని నిర్ధారించుకొని ఇంకా వెతికాను. ఇంకా మేము కొన్న పెన్నులు, పెన్సిళ్ళు కూడా దొరికాయి. ఉదయం సన్నివేశం గుర్తొచ్చింది. కళ్ళు తిరిగాయి. వెంటనే శ్రీమతిని పిలిచాను. బాబిగాడి ఘనకార్యాలను అర్థం చేసుకున్న శ్రీమతి పడుకున్న బాబిగాడిపై విరుచుకుపడబోయింది. వద్దని వారించాను. ''అలా కాదండీ... నాలుగేస్తే వాడి ప్రవర్తనలో మార్పు వస్తుంది.'' అనడంతో, ''అలా బయటకుపదా'' అంటూ వరండాలోకి తీసుకెళ్ళాను శ్రీమతిని.

''చూడు లక్ష్మీ... ఉదయం వారుతగవుకి రాలేదు. ఆర్థికంగా వెనుకబడ్డవాడైనా ఎంత సౌమ్యంగా అడిగాడు. చెప్పాలంటే నీవే దారుణంగా ప్రవర్తించావ్. మన పిల్లలెపుడూ మనకి మంచివాళ్ళుగానే కన్పిస్తారు. దానిక్కారణం వారు మనముందు తప్పు చేయరు. అంతేగాకుండా వారిపై మనకున్న మమకారం అలా చేస్తుందేమో. నీవు ఉదయం అలా ప్రవర్తించకుండా ఉండాల్సింది. ఏమైనప్పటికీ 'మార్పు' రావలసింది ముందు మన ప్రవర్తనలో'' అంటూ సన్నగా మందలించడంతో ఆమె చెక్కిళ్ళపై కన్నీటి బిందువులు జలజలా రాలడంతోబాటు ఆమె మొహంలో పశ్చాత్తాప భావన కన్పించింది.

★